## క్లుప్తంగా

### ఆరోగ్యవంతమైన జీవితానికి వాకింగ్ చేయాలి



హాఫ్ మారథాన్ పూర్తి చేసిన కమిషనర్ సమ్మయ్య

జగిత్యాలటౌన్: ఆరోగ్యవంతమైన జీవితానికి క్రమం తప్పకుండా వాకింగ్, జాగింగ్ చేయాలని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన హాఫ్ మారథాన్(21.01కిమీటర్ల పరుగు)ను కమిషనర్ సమ్మయ్య 2గంటల 30నివిషాలలో పూర్తి చేయగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ రోజు వాకింగ్, జాగింగ్, రన్నింగ్ చేయాలని ఫిట్‌నెస్‌తోనే ఆరోగ్యమని అన్నారు.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన బెక్కం లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించి రూ.5000 ఆర్థిక సాయం కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మ్యాక లక్ష్మణ్, శనిగరపు తిరుపతి పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ ఉద్యమ కారులు వినతిపత్రం అందజేశారు. ఉద్యమ కారులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉద్యమంలో సర్వస్వం కోల్పోయిన ఉద్యమ కారులకు అండగా నిలవాలన్నారు. ఉద్యమ కారుల కుటుంబాలకు ఇంటి స్థలం, ఉచిత బస్ పాసులు, ఆరోగ్య కార్డులు, 25వేల పెన్షన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాగుల రాజు, జుట్టు శంకర్, మరాటి గంగారెడ్డి, ప్రేమ్ కుమార్, గంగస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

### వర్షపు నీటితో ఇబ్బందులు


నిలిచిన వర్షపు నీరు

రాయికల్: పట్టణంలోని రెండో వార్డులో వీరాపూర్ కు వెళ్లే కాలనీలో వర్షపు నీరు నిలవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద తీవ్రమవుతుందని పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ చిరంజీవి స్పందించి నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పొన్నం భూమన్నగౌడ్ ఆదివారం తాటి చెట్టుపై నుంచి తీవ్రంగా గాయపడ్డాడు. భూమన్నగౌడ్‌కు తాళ్లధర్మారం గ్రామ శివారులో కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతుండగా.. కాళ్లకున్న తాడు తెగిపోవడంతో చెట్టుపై నుండి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆ గ్రామంలో పర్యటిస్తుండగా.. సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో జగిత్యాలకు తరలించి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్సకు కరీంనగర్ తరలించారు.


బురదరోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు

## ప్రమాదపుటంచున ప్రయాణం..

గొల్లపల్లి: మండలంలోని వెన్నుమట్లలో వంతెన నిర్మాణపనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇరువైపులా పోసిన మట్టిరోడ్డు బురదమయంగా మారింది. వాహనాల రాకపోకలతో బురదలో వాహనాలు జారుతున్నాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసి వస్తోంది. వాహనాలు అదుపుతప్పి చాలా మంది పడిపోయి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వంతెన పనులు నత్తనడక సాగుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తి చేసి బురద మట్టి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బురదరోడ్డులో ఇరుక్కుపోయిన టాటా ఏస్

## బురద రోడ్ల ఇక్కట్లు తప్పేదెప్పుడో?

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట- కోనాపూర్ గ్రామాల మధ్య రోడ్డు వర్షాలతో బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై బైకులు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, సమస్యను పట్టించుకునేవారు లేరని రెండు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. బురదరోడ్డులో ఆటోలు, బైకులు ఇరుక్కుపోతున్నాయని వాపోతున్నారు. రోడ్డు బురదమయంగా ఉండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులు వెళ్లేవారు తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి బురదరోడ్డు కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


బురదమయమైన వెంకట్రావుపేట-ఒడ్యాడ్ ప్రధాన రోడ్డు

## రోడ్లన్నీ బురదమయం..

మేడిపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. వెంకట్రావుపేట-ఒడ్యాడ్ ప్రధాన రోడ్డు బురదతో నిండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దకాలం క్రితం వేసిన రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచాయి. రోడ్లపై నిలిచిన నీటిలో దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. చాలా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు కోతలకు గురైయ్యాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ అధికారులు.. కరుణించండి


గొర్రెపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మల్లాపూర్: వరినాట్లు వేస్తున్నామని, పొలాలకు నీరు కావాలని, పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయాలని రైతులు విద్యుత్ అధికారులు వేడుకుంటున్నారు. మండలంలోని గొర్రెపల్లికి చెందిన 20 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్ల కోసం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల 10న ఆ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో ఆ రైతులు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వేరేది అమర్చారు. పొలాల సాగుకు కరెంట్ కష్టాలు తీరినట్లేనని సంబరపడ్డ రైతులకు ఆ ట్రాన్స్‌ఫార్మర్ కూడా రిపేరుకు రావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సిబ్బందితో కలిసి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించినా రైతుల సమస్య కొలిక్కిరాలేదు. అసలే వరినాట్ల సమయం కావడంతో అదనుపోతే వానాకాలం పంటకు దూరం కా వాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేరే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

## మోడల్ స్కూల్‌కు రహదారి నిర్మించాలి


రహదారి వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి బురదమయంగా మారిందని దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టి రహదారి నిర్మాణం చేపట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారిని పరిశీలించి మాట్లాడారు. ఈ రహదారిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కనీసం నడవలేకపోతున్నారని దీనిపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చర్యలు తీసుకుని రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. రహదారి నిర్మాణంలో జాప్యం చేస్తే కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దూమల గంగారాం, , ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లూరు సురేందర్, కో ఇన్‌చార్జి పొడేటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

కథలాపూర్: మండలంలోని దుంపేటలో మాజీ ఉప సర్పంచ్ ఆకుల స్వామి అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందగా, బాధితకుటుంబాన్ని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ మల్యాల రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ఎం.డీ రఫీక్, జెల్ల వేణు, బద్దం మహేందర్‌రెడ్డి, వినోద్ రావు, గంగారెడ్డి ఉన్నారు.

**ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

కోరుట్ల: పట్టణంలోని మనోవరీ హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఫైబ్రోస్కాన్ (లివర్ స్కానింగ్) శిబిరానికి విశేష స్పందన లభించింది. 90 మందికి ఉచితంగా లివర్ స్కానింగ్ చేసి తగు జాగ్రత్త చర్యలను వివరించారు. అనంతరం ఆసుపత్రి వైద్య బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ముక్క ఇంద్రనీల్, డాక్టర్ గీతా ఇంద్రనీల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుందారపు మహేందర్ కార్యదర్శి గద్దె నరేంద్ర, కోశాధికారి జగపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కథలాపూర్‌లో కుక్కల బెడద**

కథలాపూర్: మండలకేంద్రంలో కుక్కల బెడద తీవ్రమైందని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కథలాపూర్‌లో మెయిన్ రోడ్డులో వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తున్నవారిపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన నలుగురిపై కుక్కలు దాడిచేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి**

మల్యాల: డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ఉప వైద్య,ఆరోగ్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ అన్నారు. మల్యాల మండలంలో డెంగీ ప్రబలుతోంది. గతంలో ఒకరికి డెంగీ పాజిటివ్ రాగా, ప్రస్తుతం మరో ఇద్దరు డెంగీ బారినపడ్డారు. మండల కేంద్రంలోని కొత్తపేటకు చెందిన వ్యక్తితోపాటు సర్వాపూర్ గ్రామానికి చెందిన మహిళకు డెంగీ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం జిల్లా ఉప వైద్య,ఆరోగ్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ మల్యాల, సర్వాపూర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. మురికాలువల్లో దోమల నివారణ గోలీలు వేయించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### చెక్కులు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ఆదివారం ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గుడిసె జితేందర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెక్కులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంజూరు చేయించారని పేర్కొన్నారు.

**విద్యార్థులను తీర్చిదిద్దడం గురుతర బాధ్యత**

కోరుట్ల: విద్యార్థులను తీర్చిదిద్దడం గురుతర బాధ్యత అని ఆర్మూర్ లయన్స్ క్లబ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నివేదన్ అన్నారు. ఆదివారం కోరుట్ల మండలం వెంకటాపూర్ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన బాదం పురుషోత్తం పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాదాం పురుషోత్తంను ఘనంగా సన్మానించారు.

### ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా లింబాద్రి


లింబాద్రి

జగిత్యాలజోన్: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన మైలారపు లింబాద్రి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో లింబాద్రి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి ముక్త శ్రీనివాస్ తెలిపారు. సంఘం పటిష్టత కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

**పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ**

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి పద్మశాలీ గ్రామశాఖ సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక పద్మశాలీ సంఘం భవనంలో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా ఎలగొండ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా తుమ్మ సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా తాటిపాముల తిరుపతి, సంయుక్త కోశాధికారిగా కోమాకుల రమేశ్, కార్యదర్శిగా పెంట శేఖర్, కోశాధికారిగా నల్ల రమేశ్ ఎన్నికయ్యారు. మండల పద్మశాలీ సేవా సంఘం నాయకుల సమక్షంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు మండల సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశం తెలిపారు.

### బాధితుడికి ప్రభుత్వ విప్ పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. విషయం తెలిసిన వెంటనే ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

### 'తెలంగాణ రైతాంగాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టారు'

కథలాపూర్: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే విషయంలో తెలంగాణ రైతాంగాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టిందే సీఎం రేవంత్‌రెడ్డి అని, రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి మండిపడ్డారు. ఆదివారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వినియోగదారులకు గుదిబండగా మారుతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే చెప్పారన్నారు. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపం ఇప్పుడు బయట పడిందన్నారు. రూ. 30 వేల కోట్లు అప్పు తీసుకోవడానికి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్‌రెడ్డి స్మార్ట్ మీటర్ల కోసం ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలనే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

**బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**

కోరుట్ల: పట్టణానికి చెందిన నరసింహా చారి అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి జై హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. నరసింహా చారి నిరుపేద కుటుంబం కావటంతో చందాల ద్వారా రూ. 40 వేలు, సేవా సమితి ద్వారా రూ. 10 వేలు , మొత్తం రూ. 50 వేలు మృతుడి చెల్లెలు పేరుమీద బ్యాంక్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గజం శంకర్, జంగం అనీల్, బాలె మహేశ్, మూడపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**చర్చిలో వనమహోత్సవం**

జగిత్యాలటౌన్: పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో గల సీఎస్ఐ వెస్లీ చర్చి ఆవరణలో ఆదివారం ఆరాధన అనంతరం వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు మొక్కలు నాటి వాటి ఆవశ్యకతను చాటారు. ఫాస్ట్రేట్ చైర్మన్, ఆలయ గురువు జీవరత్నం మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కలిగే పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీనివాస గురుకుల పాఠశాల 2002-03 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం వెల్లుల శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకుని ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని, నాటి మధుర స్మృతులను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠశాలు బోధించిన గురువులను సన్మానించారు.

## హాస్టళ్లలో అధికారుల పరిశీలన



కోరుట్ల: పారిశుధ్య పనులు చేయిస్తున్న కమిషనర్ తిరుపతి   రాయికల్ మండలం అల్లీపూర్ హాస్టల్‌లో..

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలు, విద్యాలయాల్లో ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల సోషల్ వెల్ఫేర్ ఉమెన్స్ కాలేజీ, కల్లూర్ రోడ్ సోషల్ వెల్ఫేర్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ అగ్రికల్చర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యాలయాల్లో కిచెన్, బాత్‌రూమ్స్, వంటశాలలు, నీటి వసతులను బాగు చేయించారు. కొన్ని విద్యాలయాల్లో పెరిగిన చెట్లు, గడ్డి వంటివి తొలగించారు. కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం హాస్టల్‌ను ఆదివారం ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్ పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంను పరిశీలించి పరిశుభ్రత విషయంలో సూచనలిచ్చారు. అనంతరం హాస్టల్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సాయినాథ్ ఉన్నారు.

రాయికల్: పట్టణంలోని బీసీ,ఎస్సీ,అల్లీపూర్, ఒడ్డెలింగాపూర్ లోని గురుకులం, ఉపమడుగు గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆదివారం ఎంపీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో మౌలిక వసతులపై ఆరా తీశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ధర్మపురి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలను పారిశుధ్య పనులతో పాటు భోజనశాలలో విద్యార్థులకు అందించే కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు వేడి వేడిగా నాణ్యమైన భోజనం అందించాలని కమిషనర్ సూచించారు. వసతి గృహాలకు వెళ్లే రహదారి బురుదమయం కావడంతో ట్రాక్టర్ల తో మొరం తెప్పించి పోయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి(బుగ్గారం): వసతి గృహంలో పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బుగ్గారం ఎంపిడీవో శ్రీనివాస్ అన్నారు. బుగ్గారంలోని ఎస్సీ వసతి గృహాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు పెడుతున్న భోజన వసతులు, రోజువారి అందించే మెనుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో శానిటేషన్ పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో అబ్జల్ మియా, పంచాయతీ కార్యదర్శి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న ఆరె కటిక సంఘం మహిళలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని వరాల పోచమ్మ తల్లి బోనాల పండుగలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బోనాలు మన సంస్కృతిలో భాగమని, బోనాల పండుగ చివరి ఆదివారం కావడంతో ప్రజలు ఉత్సాహంగా పండుగను జరుపుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులి శేఖర్, ముఖేష్‌ఖన్నా, రాజేష్‌ఖన్నా,నరేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో..**

పట్టణంలోని ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లపోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆరె కటిక సంఘం పట్టణ అధ్యక్షుడు కోయల్కార్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోగికార్ నరేష్, ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్, శివ, రాజు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మైసమ్మకు బోనాలు**

కోరుట్ల: పట్టణంలోని 28 వ వార్డులో ఆదివారం మైసమ్మకు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి మైసమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పెంగెం గణేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో గుండేలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండేలమ్మ కట్టె విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకవెళ్లి గ్రామ శివారులోని ఆలయంలో ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

### భవానీ ఆలయంలో ప్రత్యేక భజనలు

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాముపల్లిలో శ్రీ దుర్గా భవానీ అమ్మవారి ఆలయ సన్నిధానంలో మాతలతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాలకు చెందిన లక్ష్మీ గణేశ్ మందిర్ ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసి అమ్మవారి పారాయణం మూడు గంటల పాటు బ్రహ్మాండంగా భజనలు చేశారు.కార్యక్రమంలో దుర్గభవానీ ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## వెన్న ముద్దల గండిలో పర్యాటకుల సందడి


సెల్ఫీ దిగుతున్న యువతులు

రాయికల్: మండలంలోని కట్కాపూర్ వెన్నెముద్దల గండి వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పర్యాటకులు వెన్నముద్దల గండిని సందర్శించి పచ్చని చెట్ల మధ్య పారుతున్న నీటిలో ఆడుతూ పాడుతూ గడిపారు. సెల్ఫీ ఫొటోలు దిగారు. పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది.